క్లుప్తంగా

వైభవంగా వాదీంద్రతీర్థుల ఆరాధనోత్సవం

మంత్రాలయం రూరల్: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో పూర్వ పీఠాధిపతి, రాఘవేంద్రస్వామి మునిమనవడైన వాదీంద్ర తీర్థుల 273వ ఆరాధనోత్సవం సోమవారం కనులపండువగా జరిగింది. పీఠాధిపతి సుబుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మూల బృందావనానికి విశేషంగా క్షీర, పంచామృతాభిషేకం నిర్వహించారు. పలు రకాల పూలమాలలు, వెండి, బంగారు కవచాలు, పట్టువస్త్రాలతో సుందరంగా అలంకరించారు. పీఠాధిపతి బృందావనానికి మంగళహారతి ఇచ్చారు. అనంతరం ప్రాకారంలో బంగారు రథంపై స్వామి రచించిన గ్రంథాలు, ఆయన బృందావన చిత్రపటాన్ని కొలుదీర్చి వేలాది మంది భక్తుల నడుమ మంగళవాద్యాలతో ఘనంగా ఊరేగించారు. ఊంజలిసేవ నిర్వహించారు. మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేశ్‌జ్యోషి, శ్రీపతిచార్, పీఆర్వో ఐపీ నరసింహమూర్తి, బిందుమాధవ్, వ్యాసరాజచార్ తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్‌ప్లాన్ ఆధారంగానే అభివృద్ధి

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ అభివృద్ధి పనులు మాస్టర్‌ప్లాన్ ప్రకారం చేపడుతున్నట్లు జిల్లా దేవదాయశాఖ ఎస్ఈ పుల్లయ్య, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసప్రసాద్‌లు అన్నారు. ఆలయంలో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు సోమవారం స్థల పరిశీలన చేశారు. లడ్డూ తయారీ పాకశాల మార్పు కోసం స్థలాన్ని పరిశీలించారు. అలాగే రూ.30 లక్షలతో చేపట్టనున్న బాత్‌రూం, మరుగుదొడ్లకు స్థల పరిశీలన చేశారు. మాస్టర్‌ప్లాన్ అనుగుణంగా పనులు చేపట్టాలని అధికారుల్ని ఆదేశించారు. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్, అసిస్టెంట్ కమిషనర్ వాణి, సిబ్బంది వెంట ఉన్నారు.

సారా బట్టీలపై దాడులు

ఆదోని రూరల్ : పట్టణంలోని పుల్లెట్ల కొండపైన సారా తయారీ బట్టీలపై దాడి చేసి, 300 లీట్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ హరికృష్ణ సోమవారం తెలిపారు. నిర్వాహకుడు బోయ లాల్‌స్వామిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. అలాగే ఆదోని పట్టణంలోని బావాజీపేటలో బోయ రాధమ్మ వద్ద 192 కర్ణాటక మద్యం ప్యాకెట్లు గుర్తించి, ఆమెను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించడం జరిగిందన్నారు. దాడుల్లో సెబ్ ఎస్ఐలు శివప్రసాద్, మధుసూదన్‌రెడ్డి, పీసీలు ముని, రోహిన్, శ్రీనులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పెద్దకడబూరు: మండల పరిధిలోని గవిగట్టు గ్రామంలో పేకాట ఆడుతున్న 8 మందిని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ.. గవిగట్టు గ్రామ చావిడి వద్ద అదే గ్రామానికి చెందిన పలువురు సోమవారం పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు సిబ్బందితో వెళ్లి పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని వారినుంచి రూ.5,850 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

టీడీపీ మోసపూరిత మేనిఫెస్టోను నమ్మొద్దు



మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆదోని టౌన్: అధికారం కోసం తపిస్తూ పేదలను మోసం చేసేందుకు టీడీపీ తీసుకొచ్చిన మేనిఫెస్టోను నమ్మవద్దని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. 14 ఏళ్ల పాలనలో ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసిన చంద్రబాబునాయుడు నేడు ప్రజలపై అమితమైన ప్రేమ కురిపిస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలతో కలిసి వైఎస్సార్ విగ్రహానికి జలాభిషేకం చేశారు. యువ నాయకుడు మనోజ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ కార్యాలయం నుంచి భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఎన్టీఆర్ బతికుండగానే వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు టీడీపీ పగ్గాలను లాక్కొని దొడ్డిదారిలో ముఖ్యమంత్రి అయ్యారని ఆరోపించారు. 2014 ఎన్నికల్లో అమలుకు సాధ్యంకాని 700 హామీలతో మేనిఫెస్టోను విడుదల చేసి అందులో ఏ ఒక్కటీ నెరవేర్చకుండా మేనిఫెస్టోను పార్టీ వెబ్‌సైట్‌లో కూడా లేకుండా తొలగించారని గుర్తుచేశారు. మరోసారి ముఖ్యమంత్రి కావాలనే పదవీ కాంక్షతో మోసపూరిత మేనిఫెస్టోను తెరపైకి తెచ్చారన్నారు. ఎమ్మెల్యే తనయుడు మనోజ్‌రెడ్డి మాట్లాడుతూ.. 14 ఏళ్ల పాలనలో పేదలకు సెంటు స్థలం ఇవ్వలేని చంద్రబాబు, జగనన్న లక్షలాది ఇళ్ల స్థలాలను పంపిణీ చేస్తుంటే ఓర్వలేక ప్రజలను అవమానపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, కౌన్సిలర్లు రఘునాథ్‌రెడ్డి, ఫయాజ్‌అహ్మద్, చలపతి, నాయకులు సన్నీ, రామాంజనేయులు, పెద్దిరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదోనిలో అభివృద్ధి మంత్రం

- వైఎస్సార్‌సీపీ పాలనలో శరవేగంగా అభివృద్ధి
- రూ.7 కోట్లతో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు
- రూ.30 కోట్లతో జగనన్న కాలనీల్లో పక్కా ఇల్లు
- 4720 టిడ్కో ఇళ్లు పంపిణీ
- ఏరియా ఆస్పత్రిలో రూ.10 కోట్లతో వంద పడకల అత్యాధునిక భవన నిర్మాణం



మాతా శిశుసంరక్షణ కేంద్రంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న 50 పడకల అత్యాధునిక భవనం

ఆదోని టౌన్: వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల హయాంలో ఆదోని అభివృద్ధి పథంలో పరుగులుతీస్తోంది. నియోజకవర్గంలో 37 పంచాయతీలు, ఆరు మజారా గ్రామాలు, పట్టణంలో 42 వార్డులు ఉన్నాయి. నియోజకవర్గంలో దాదాపు జనాభా 3 లక్షలకు పైమాటే. నాలుగేళ్ల పాలనలో పట్టణంలో వాడవాడలా సీసీ రోడ్లు, మురుగు కాలువలు, తాగునీటి పైపులైన్లు, కల్వర్టుల ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ నీటి సమస్య లేకుండా అధికారులు చర్యలు చేపట్టారు. మేజర్ గ్రామాలతో పాటు మజారా గ్రామాల్లో రోడ్లు, పెండింగ్‌లో ఉన్న రహదారి సమస్యలను పరిష్కరిస్తున్నారు. నాలుగేళ్లలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జరిగాయి.

- 2019–20లో 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.99 కోట్లతో 65 అభివృద్ధి పనులు చేశారు. కల్వర్టులు, రోడ్ల కాలువలు, పైపులైన్లు తదితర అభివృద్ధి పనులు
- 2021–22లో రూ.50 లక్షలతో ఒక పని పూర్తి చేశారు.
- 2020–21లో 15వ ఆర్థిక సంఘం నిధుల కింద రూ.6.70 కోట్లతో 34 అభివృద్ధి పనులు చేపట్టారు. రెండో విడత కింద రూ.9,92,43,000 నిధులతో 24 పనులు చేశారు.
- వైఎస్సార్ కాన్సెంటిన్సీ పథకం కింద 2020–21లో రూ.1.60 కోట్లతో రెండు అభివృద్ధి పనులు పూర్తి చేశారు.
- 2021–22లో వైఎస్సార్ అర్బన్ కాన్సెంటిన్సీ కింద రూ.40 లక్షలతో నాలుగు పనులను చేశారు.
- 2022–23లో జీజీఎంపీ ఫండ్స్ కింద రూ.2.20 కోట్లతో 28 అభివృద్ధి పనులు
- 2022–23లో సీఎండీఎఫ్ పథకం కింద రూ.15 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం
- 2022–23లో సీఎం హామీ కింద రూ.5.30 కోట్లతో రెండు పనులు, 2018 నుంచి ఎస్‌ఏసీ పథకం కింద రూ.2.50 కోట్లతో పనులు
- జనరల్ ఫండ్స్ కింద 2021–23 వరకు రూ.6.8 కోట్లతో 56 పనులు, 2019–20లో రూ.2 కోట్లతో 85 పనులను పూర్తి చేశారు.

రూ.7 కోట్లతో పాలిటెక్నిక్ కళాశాల

ఆదోని మండల పరిధిలోని విరుపాపురం–సాదాపురం మధ్య రూ.7 కోట్లతో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నిర్మాణం పూర్తి చేశారు. త్వరలోనే ప్రారంభం కానుంది.

- ఆదోని మండలం మదిరె, చిన్నహరివాణం, సంతెకూడ్లూరు గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు మదిరె వద్ద కొత్తగా ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణం పనులు రూ.10 కోట్లతో జరుగుతున్నాయి.
- పట్టణంలో రెండు అర్బన్ హెల్త్ సెంటర్లను ప్రారంభించారు. సబ్‌రిజిస్టర్ కార్యాలయం వద్ద కొత్తగా మరో ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

మెడికల్ కళాశాల మంజూరు

ఆంధ్రా ముంబాయిగా పేరుగాంచిన ఆదోనిలో రూ.475 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణం చేపట్టడం ఇక్కడి ప్రజలు చేసుకున్న అదృష్టం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నివిధాలుగా వెనకబడిన ఆదోనిలో అభివృద్ధి, కనీస వైద్యం పొందలేక ఇబ్బందులు పడుతున్న పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించాలన్న సదుద్దేశంతో మెడికల్ కళాశాలను మంజూరు చేసి, వెంటనే పనులు ప్రారంభించారు. ప్రస్తుతం కళాశాల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. కళాశాల ఏర్పాటుతో పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందడమేగాకుండా నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు, ఖాళీగా ఉన్న డాక్టర్లు, సిబ్బంది పోస్టుల భర్తీ కానున్నాయి. ఎలాంటి జబ్బుకైనా స్థానికంగానే సకాలంలో వైద్యం పొందవచ్చు. మండలంలోని బైచిగేరి–నాగలాపురం మధ్య 58.44 ఎకరాల విస్తీర్ణంలో కళాశాలను నిర్మిస్తున్నారు.



అందంగా రూపుదిద్దుకున్న జిమ్ రోడ్డు



జగనన్న కాలనీల్లో వివిధ దశల్లో జరుగుతున్న నిర్మాణం పనులు

రూ.30 కోట్లతో పక్కా ఇల్లు

మండిగిరి లేఅవుట్‌లో దాదాపు రూ.30 కోట్లతో హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో పక్కా ఇళ్ల నిర్మాణం పనులు జరుగుతున్నాయి. ఇక్కడ దాదాపు 10,200 మందికి ఇంటి స్థలాలు పంపిణీ చేశారు. ప్రభుత్వమే థర్డ్ పార్టీ ద్వారా ఇళ్లను నిర్మించి ఇస్తోంది. ప్రస్తుతం 5,100 ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి. లేఅవుట్‌లో రూ.9 కోట్లతో రోడ్ల ఏర్పాటు, రూ.7.50 కోట్లతో తాగునీటి వసతి, రూ. 20 లక్షలతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలను ఏర్పాటు చేశారు. మురుగు కాలువల పనులు జరుగుతున్నాయి.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో నూతన భవనాలు

పట్టణంలో మరో రెండు ఆస్పత్రి భవనాలు అత్యాధునిక వసతులతో నిర్మితమవుతున్నాయి. ఒక్కో భవనానికి రూ.10 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఏరియా ఆస్పత్రిలో వంద పడకల నూతన భవనం, స్త్రీల, పిల్లల ఆస్పత్రిలో 50 పడకలు భవనంను పూర్తి చేశారు. త్వరలోనే ప్రారంభం కానున్నాయి.

వాడవాడలా అభివృద్ధి చేశారు



పట్టణంలో వాడవాడలా సీసీ రోడ్లు, పైపులైన్లు వేశారు. గతంలో ఎస్‌జీఓస్ కాలనీలో మట్టి రోడ్లపై నడవాలంటే చాలా ఇబ్బందులు పడేవాళ్లం. గుంతలు పడి ఎగుడుదిగుడుగా ఉండేది. చిన్నపాటి వర్షం వచ్చినా బురదమయమయ్యేది. నడవడానికి కూడా వీలు లేకుండా ఉండేది. నాలుగేళ్లలో సీసీ, బీటీ రోడ్లతో పాటు కాలువలు ఏర్పాటు చేశారు. వీధిలైట్లు కూడా ప్రతిస్తంభానికి వేశారు.

– రామలింగ, ఎస్‌జీఓస్ కాలనీ, ఆదోని

పల్లెలకు కొత్త శోభ



పల్లెల్లోనూ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో పల్లె ప్రజల సమస్యలు పట్టించుకునేవారు కాదు. జగనన్న ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు. ప్రజా అవసరం మేరకు అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ముఖ్యంగా తాగునీటి సమస్య లేకుండా చూస్తున్నారు.

– విరుపాక్షి, గణేకల్ గ్రామం

ఇంకా అభివృద్ధి చేస్తాం



ఆదోని నియోజకవర్గాన్ని ఇంకా అభివృద్ధి చేస్తాం. పట్టణంలో రోడ్ల విస్తరణ, ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తాం. ఆస్పరి–ఆలూరు రోడ్డులో ఆగిపోయిన బైపాస్ రోడ్డు నిర్మాణం త్వరలోనే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. కొన్ని సాంకేతిక కారణాల వల్ల పనులు మొదలు పెట్టలేకపోయాం. త్వరలోనే ప్రారంభిస్తాం. గత టీడీపీ హయాంలో ఆదోనిలో జరిగిన అభివృద్ధి ఏమీ లేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేశాం. – ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

నాలుగేళ్లు.. అభివృద్ధి పరుగులు

- వైఎస్సార్‌సీపీ పాలనలో స్వర్ణయుగం
- సంక్షేమ పథకాలతో సామాన్యులకు సాంత్వన
- పల్లెల్లో వెలసిన ప్రగతి సౌధాలు
- నియోజకవర్గానికి రూ.1,299 కోట్ల ఫలాలు

నియోజకవర్గం :	మంత్రాలయం
మండలాలు :	4 (పెద్దకడబూరు, కోసిగి, మంత్రాలయం, కౌతాళం)
పంచాయతీలు :	94
మజరా గ్రామాలు :	17
జనాభా ప్రస్తుత అంచనా:	3,11,899

మంత్రాలయం: వైఎస్సార్‌సీపీ పాలన ఓ స్వర్ణయుగం. నవరత్నాలతో సాగిస్తున్న పాలన నవరస భరితం నాలుగేళ్లుగా జనమోహనంగా పాలన సాగింది. కోట్లాది ప్రజల అభిమానం చూరగొంది. పేదల అనురాగ ఆప్యాయతలకు నెలవైంది. అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలకు ప్రతి నియోజకవర్గానికి కోట్లాది రూపాయలు వెచ్చించారు. ప్రచారంలో కనిపించకపోయినా ఆచరణలో మాత్రం అద్భుత ఫలితాలు దర్శనమిస్తున్నాయి. మంత్రాలయం నియోజకవర్గంలో నాలుగేళ్ల పాలనతో సంక్షేమ పథకాల రూపేనా రూ.1,299 కోట్లు వెచ్చించడం విశేషం. అందులో సింహభాగం పేదల సంక్షేమానికి కేటాయించారు.

నియోజకవర్గంలో ప్రజల ప్రధాన జీవనాధారం వ్యవసాయం. ఆధ్యాత్మిక ఖిల్లాగా ప్రఖ్యాతి చెందిన జిల్లాలో వెనకబడిన ప్రాంతాల్లో ఇదొక్కటి. వానలు కురిస్తేనే ఇక్కడ వ్యవసాయం పండగలా సాగుతుంది. లేదంటే వలసల బాట పట్టడం తప్పదు. అయితే నాలుగేళ్లుగా సమృద్ధిగా వర్షాలు కురవడంతో వలసలు దాదాపుగా తగ్గుముఖం పట్టాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ ఫలాలు కరువవడంతో పేదల లోగిళ్లు బోసిపోయాయి. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో రూపురేఖలు మారిపోయాయి. సామాన్యుల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. ఆర్థిక సావలంభనతో పేదల లోగిళ్లలో వెలుగులు విరబూస్తున్నాయి. నాలుగేళ్లలో సంక్షేమ ఫలాలు ఎన్నో పేదల తలుపులు తట్టాయి. వేల కోట్ల రూపాయలు నియోజవర్గానికి చేరాయి. సంక్షేమ ఫలాలు రావడంతో ప్రజలు సైతం ఆనందం వ్యక్తపరుస్తున్నారు.



ఆర్డీఎస్ కాల్వ హెడ్ రెగ్యులేటర్

పల్లెల్లో ప్రగతి సౌధాలు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే ప్రజల వద్దకు పాలన తీసుకువచ్చింది. గ్రామ సచివాలయాల సౌధాలు నిర్మించి పల్లెకు అందం తెచ్చింది. లక్షలాది రూపాయలతో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నిర్మించారు. మన బడి నాడు – నేడు కింద వందలాది పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు ఇరుకు గదుల్లో చదువులకు స్వస్తి పలికారు. ప్రతి గ్రామాన పేదోడి ఇంటి కల సాకారం చేశారు. నియోజకవర్గంలో దాదాపు 9 వేల ఇంటి పట్టాలు మంజూరు చేశారు.

కుటుంబ వికాసం

సంక్షేమానికి పెద్దపీట వేయడంలో ఈ ప్రభుత్వం ముందంజలో ఉంది. నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ ఏదో ఒక సంక్షేమ పథకం వర్తిస్తోంది. వైఎస్సార్ రైతు భరోసా 43,585 రైతులకు రూ. 171.78 కోట్లు, వైఎస్సార్ పంట బీమా ద్వారా 55 వేల మంది రైతులకు రూ. 60 కోట్లు, అమ్మ ఒడి ద్వారా 54,915 మంది విద్యార్థులకు రూ.125.14 కోట్లు, వైఎస్సార్ సున్నా వడ్డీ 4,738 మహిళలకు రూ.16.59 కోట్లు వెచ్చించారు. వైఎస్సార్ ఆసరా కింద రూ. 39.08 కోట్లు, స్త్రీనిధి రూ.30 కోట్లు ఖర్చు చేశారు. ఇలా సంక్షేమ పథకాల కింద వందలాది కోట్లు నియోజకవర్గానికి కేటాయించారు.



రూ.5 కోట్లతో కోసిగి–డి.బెళగల్ మధ్య నిర్మించిన ఆర్అండ్‌బీ రోడ్డు



రూ.18.52 కోట్లతో ఐరన్‌గల్లు ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ పనులు చేస్తున్న దృశ్యం

నాలుగేళ్లలో జరిగిన ప్రగతి పనులు, చేకూరిన సంక్షేమ లబ్ధి వివరాలు

పథకం	లబ్ధిదారులు	నిధులు (రూ..)
వైఎస్సార్ రైతు భరోసా	43,585	171,78,52,000
పంట నష్ట పరిహారం	13,370	36,61,00,000
వైఎస్సార్ జలసిరి	---	12,00,00,000
ట్రాక్టర్ల సబ్సిడీ	356	2,,63,05,091
వైఎస్సార్ పంట బీమా	55 వేల మంది రైతులు	60,00,00,000
రైతు ఆత్మహత్యల పరిహారం		1,20,00,000
అమ్మ ఒడి	54,915	125,14,99,000
జగనన్న గోరుముద్ద	1,33,113	18,59,80,025
జగనన్న విద్యాకానుక	7,140	15,60,32,205
మనబడి–నాడు నేడు	178 పాఠశాలలు	111,76,58,945
వైఎస్సార్ సున్నా వడ్డీ	4,738	21,59,22,000
వైఎస్సార్ ఆసరా	3,168	39,08,36,000
స్త్రీనిధి	6,639	30,02,32,000
ఎస్.హెచ్.జి. చేయూత	619 గ్రూపులు	3,08,00,000
జగనన్న తోడు	3078	30,78,000
హౌసింగ్ శాఖ	9,120 ఇళ్లు	15,68,12,900
జగనన్న కాలనీలో తాగునీరు	---	11,33,80,000
ఎన్ఆర్ఈజీఎస్ డ్రైయినేజీ	---	7,55,00,000
జల జీవన్ మిషన్	---	49,40,00,000
ఎల్లెల్సీమరియు రాంపురం కాల్వ ఆధునికీకరణ		19,43,00,000
ఆర్డీఎస్‌కెనాల్	---	15,00,00,000
ఉపాధి హామీ పథకం సామగ్రి		32,70,00,000
ఉపాధి వేతనాలు		105,78,00,000
సచివాలయాలు నిర్మాణం	80	31,35,00,000
రైతు భరోసా కేంద్రాలు	77	16,78,60,000
వైఎస్సార్ హెల్త్ సెంటర్లు	56	9,80,00,000
సీసీరోడ్లు, డ్రైయినేజీలు		16,05,78,000
పాఠశాలల కాంపౌండ్స్	24	2,23,00,000
అంగన్‌వాడీ భవనాలు	04	16,00,000
బీటీ రోడ్లు	--	1,61,72,000

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



మా గ్రామానికి ఆనుకుని పులికనుమ రిజర్వాయర్ ఏర్పాటు చేశారు. గ్రామ రైతులు వందలాది ఎకరాలు రిజర్వాయర్ల నిర్మాణంలో కోల్పోయారు. చెంతనే రిజర్వాయర్ ఉన్నా మాకు ఎలాంటి ప్రయోజనం లేక పోయింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తమ కష్టాలను గుర్తించి ఎత్తిపోతల పథకంతో పాటు సాగు, తాగునీటి అవసరాలు తీర్చేందుకు శ్రీకారం చుట్టింది. వేలాది మంది దాహార్తి తీర్చడంతో పాటు 1500 ఎకరాలకు తాగునీరు అందించే అవకాశం కల్పించారు. ప్రభుత్వ మేలును మరువలేం. – రమేష్, కోసిగి

సొంతింటి కల నెరవేరింది



కోసిగి గ్రామంలో కడపాళెంలో చాలా ఏళ్లుగా గుడిసెలో ఉంటూ జీవనం సాగించాం. వైఎస్సార్‌సీపీ హయాంలో మా కుటుంబంలో అమ్మ, అన్నతో పాటు నేను సొంతింటికి బిల్లులు మంజూరయ్యాయి. మూడు ఇళ్లు నిర్మించుకున్నాం. ఇంటి బిల్లులు సక్రమంగా పడ్డాయి. మా కుటుంబంలో అంత ఇంటిల్లా పాటి సొంత ఇంటిని నిర్మించుకోవడం సంతోషకరంగా ఉంది. – మహేష్, కోసిగి

ఇది ప్రజల ప్రభుత్వం



ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ప్రజలే దేవుళ్లుగా భావించి సీఎం వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారు. అవినీతికి తావు లేకుండా సంక్షేమ ఫలాలు పేదల దరికి చేర్చుతున్నారు. ఇలాంటి సంక్షేమ బాటసారిని ఎక్కడా చూడలేదు. జగనన్న సహకారంతో నియోజకవర్గంలో రైతుల కోసం రూ.7.17 కోట్లతో 6 ఎత్తిపోతల పథకాల నిర్మాణం చేపట్టాం. ఆర్డీఎస్ కుడి గట్టు కాల్వకు ఇప్పటికే రూ.15 కోట్లకు పైగా ఖర్చు చేశాం. 74 రైతు మిత్ర గ్రూపులకు ట్రాక్టర్లతో పాటు వ్యవసాయ పనిముట్లు మంజూరు చేశాం. ప్రతిపక్ష పార్టీలకు చెంపపెట్టుగా సంక్షేమ ఫలాలు అందిస్తుండడం విశేషం. – వై.బాలనాగిరెడ్డి, ఎమ్మెల్యే

వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం



ఉరుకుంద ఆలయంలో ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

కౌతాళం/కోసిగి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. కోసిగి మౌంట్ కార్మెంట్ పాఠశాల నుంచి కోసిగి, జుమ్మలదిన్నె మీదుగానుంచి ప్రారంభమైన ర్యాలీ ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయం వరకు కొనసాగింది. ఈరన్న స్వామిని దర్శించుకుని ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు సంక్షేమ పథకాలను పక్కాగా అమలుచేస్తూ రాష్ట్రాభివృద్ధిని ముందుకు తీసుకెళుతున్న ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి, అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి దోహదపడేలా పథకాలు అమలు చేస్తున్నారన్నారు. రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అఖండ విజయం ఖాయం అని, తాము చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఎంపీపీ ఈరన్న, నాయకులు మురళిమోహన్‌రెడ్డి, మహంతేష్‌స్వామి, నాడిగె నాగరాజు, మంగమ్మ, బెట్టన్నగౌడ్, రాధప్రియదర్శిని, అమరేష్, బుజ్జిస్వామి, దాట్ల కృష్ణంరాజు ప్రహ్లాదచారి తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్‌ప్లాన్ ఆధారంగానే ఆలయాభివృద్ధి

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయం అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని, భక్తుల సౌకర్యార్థం దేవాలయాన్ని మాస్టార్‌ప్లాన్ ఆధారంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. ఆలయ మహాప్రాకారం ఆవరణలో రూ.1.28 కోట్లతో బండ పరుపు పనులకు ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగారాజ్‌గౌడ్, కౌతాళం సింగల్ విండో అధ్యక్షుడు దాట్ల కృష్ణంరాజు, వీరసేనరెడ్డిలతో కలిసి భూమి పూజ నిర్వహించారు. ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారిని ఎమ్మెల్యే దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, స్థానిక నాయకులు వెంట ఉన్నారు.

మంత్రాలయం రూరల్: మంత్రాలయానికి చెందిన తెలుగు ఆంజినేయకు సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.70 వేల చెక్కును రాంపురంలోని స్వగృహంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, వై.ప్రదీప్‌రెడ్డితో కలిసి అందజేశారు. సర్పంచ్ భీమయ్య, ఎమ్మార్పీ రెడ్డి ఉన్నారు.

అర్జీలు సత్వరం పరిష్కరించండి

ఆదోని టౌన్: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం తగదని మున్సిపాలిటీలోని వివిధ సెక్షన్లకు సంబంధించిన అధికారులను కమిషనర్ రఘునాథ్‌రెడ్డి ఆదేశించారు. స్పందనలో భాగంగా ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. హనుమాన్ నగర్‌లో అక్రమ కట్టడాలు ఎక్కువగా ఉన్నాయని, వాటిని తొలగించాలని, ఆ ప్రాంతానికి చెందిన ఇద్దరు కమిషనర్‌కు దరఖాస్తు చేసుకున్నారు. కేవీఆర్ కాలనీలో రోడ్లు, కాలువలు నిర్మించాలని కాలనీకి చెందిన సుంకన్న, భీమప్పలు కోరారు. సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. టీపీఓ, ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, వాటర్ వర్క్స్, జనన, మరణ నమోదు, రెవెన్యూ, శానిటేషన్ సెక్షన్ల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

- సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్



స్పందన కార్యక్రమంలో అర్జీ స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోని రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారమే స్పందన కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని, కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదోని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ వారంలోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సహాయకులు రామయ్య, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చేతన్‌ప్రియ తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో సమస్యల్లో కొన్ని....

- గొనెగండ్ల మండలం బి.అగ్రహారం గ్రామానికి చెందిన ఎ.రత్నం ఎమ్మిగనూరు మండలం కడివెళ్ల గ్రామంలో సర్వేనంబర్ 22లో 7.55 ఎకరాల భూమి వారసత్వంగా వచ్చిందని, ప్రస్తుతం ఆన్‌లైన్‌లో వేరే వారి పేరు మీద నమోదు అయ్యిందన్నారు. ఆ పేరు తొలగించి తన పేరు నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని అర్జీ సమర్పించారు.
- ఎమ్మిగనూరు మండలం ఏనుగుబాల గ్రామంలో సర్వేనంబర్ 116/2లో 68 సెంట్ల భూమి వారసత్వంగా వచ్చిందని, ప్రస్తుతం ఆన్‌లైన్లో వేరే వారిపేరు మీద ఉందని, విచారణ చేసి న్యాయం చేయాలని అర్జీ సమర్పించారు.
- గొనెగండ్ల మండలం పెద్దమరివీడు గ్రామానికి చెందిన కృష్ణన్నకు సంబంధించి సర్వేనంబర్ 292/2లో 57 సెంట్ల భూమి ఉందని, ప్రస్తుతం ఆన్‌లైన్‌లో వేరే వారి పేరు మీద నమోదు అయ్యిందని, ఆ పేరు తొలగించి నా పేరు ఎక్కించాలని అర్జీ సమర్పించాడు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

ఆదోని టౌన్: ఆదోని అభివద్ధే తమ లక్ష్యమని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని షేర్‌ఖాన్ కొట్టాలలో రూ.38 లక్షలతో సీసీ రోడ్లు, మురుగు కాలువలు, లోతట్టు ప్రాంతాన్ని చదును చేసే పనులకు చైర్‌పర్సన్ బోయ శాంత భూమిపూజ చేయగా, ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి గడ్డపారతో తవ్వి పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. షేర్‌ఖాన్ కొట్టాల ఏరియా ప్రయివేట్ స్థలం కావడంతో అభివద్ధి చేయలేకపోయామని, ప్రస్తుతం స్థల యజమానులతో చర్చించి ప్రజల ఇబ్బందుల దృష్ట్యా రోడ్లు, కాలువలు, లోతట్టు ప్రాంతాన్ని చదును చేసి వరదనీరు, మురుగు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్దుల్‌గౌస్, నాయకులు ఇబ్రహీం, రహిమాన్, పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.